

మల్దకల్ మండల కేంద్రంలోని ఓ కల్లు దుకాణం

కల్తీ కల్లు తయారీదారుల్లో..

గుబులు

- గద్వాలలో నార్కోటిక్ దాడులతో హడలిపోతున్న వ్యాపారులు
- పాలమూరులోనూ కల్లులో అల్ప్రాజోలం, శాక్రిన్ వాడకం
- రాజకీయ ఒత్తిళ్లు, మామూళ్లతో చర్యలకు ఎక్సైజ్ శాఖ వెనుకడుగు
- నార్కోటిక్స్ అధికారుల చేతిలో తయారీదారుల పూర్తి చిట్టా..
- వారికి పెద్ద నాయకులతో సంబంధం
- అధికార పార్టీలో ఉన్న నాయకులనూ వదలని నార్కోటిక్స్

మహబూబ్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరులో కల్తీ కల్లు తయారీదారులు ఉలికిపాటుకు గురవుతున్నారు. డిమాండ్‌కు తగ్గ చెట్లు లేకున్నా.. అంత మొత్తంలో కల్లు ఉత్పత్తి కాకున్నా.. ఇన్నాళ్లు నిషేధిత మత్తు పదార్థాలు కలిపి, ప్రజారోగ్యం చెడిపోయేందుకు కారణమవుతున్న వారిలో గుబులు మొదలైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండు రోజుల క్రితం నార్కోటిక్ అధికారులు దాడులు చేసి.. కల్తీ కల్లు తయారు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కల్తీ కల్లు తయారీదారులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వాస్తవానికి కల్లు డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేదు. పేరుకు లెక్కల్లో చెట్లను చూపిస్తున్నప్పటికీ, ఎక్కడా వాటి ద్వారా కల్లు తీయడం, నిజమైన కల్లును అందించడమనేది వాస్తవానికి సుదూరమైన అంశంగా చెప్పొచ్చు. నిషేధిత మత్తు పదార్థాలతో కల్లును తయారు చేస్తున్నారు. నురుగు కోసం ఒక కెమికల్, తెలుపు కోసం ఒక కెమికల్, తీపి కోసం ఒక కెమికల్, మత్తు కోసం మరో కెమికల్‌ను వాడుతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో సీహెచ్(క్లోరో హైడ్రేడ్) ఇబ్బడిముబ్బడిగా సరఫరా చేసేవారు. దీనిపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపడంతో ప్రస్తుతం డైజోఫామ్, అల్ప్రాజోలం, శాక్రిన్, తెలుపు తదితర హానికర పదార్థాలను వాడుతున్నారు. ఇవి కూడా మత్తుకు బానిసలను చేస్తున్నాయి. ఒక్కసారి ఈ కల్లుకు అలవాటు అయిన వారిలో మానసిక స్థితి బాగుండకపోవడం, కల్లును మానేయలేకపోవడం, అకస్మాత్తుగా మత్తును తగ్గిస్తే.. పిచ్చివాళ్లు కావడం వంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రతీ ప్రభుత్వ ఆస్పత్రిలో రోజూ వచ్చే ఓపీ రోగులు వంద మందిలో 40 నుంచి 50 మంది కల్లుకు బానిసలైన వారే ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు. పాలమూరు జిల్లాలో కూడా ఇదే తరహా కల్తీ కల్లు దందా కొనసాగిస్తున్నారు. గతంలో పాలమూరులో ఒక కాంట్రాక్టర్ ఉండేవాడు. ప్రభుత్వం మారిన తర్వాత సదరు కాంట్రాక్టు చేతులు మారింది. కానీ చేసే పని, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం మాత్రం తగ్గలేదు. తాజా దాడులతో ఈ తయారీదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే నార్కోటిక్ అధికారుల చేతుల్లో కల్తీ కల్లు తయారీదారుల పూర్తి చిట్టా ఉందని, ఆ చిట్టా ప్రకారమే వరుస క్రమంలో దాడులు చేస్తున్నారని స్పష్టమవుతోంది.

సాధారణంగా వ్యాపారాల్లో అక్రమాలకు పాల్పడేవారు.. అటు రాజకీయ నాయకులతో, ఇటు అధికారులతో మంచి సంబంధాలు కలిగి ఉంటారు. వారి ఆభయమూ పొందుతారు. ఏదైనా క్లిష్ట పరిస్థితి వచ్చినప్పుడు కాపాడతారనే ఉద్దేశంతో ఈ పనులు చేస్తారు. ఇప్పుడు కల్తీ కల్లు మాఫీయాలో ఉన్న వారు కొందరు క్రియాశీలకంగా రాజకీయాల్లో ఉండగా.. కొందరు సదరు నాయకులతో అంటకాగుతున్నారు. అయితే ఇప్పుడు సదరు రాజకీయ నాయకులు కూడా కాపాడే అవకాశం లేదు. ప్రభుత్వం నుంచి నేరుగా ఆదేశాలు ఉండటం, మాఫియా చిట్టా అందుబాటులో ఉండటం.. డీజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో

అంటకాగినా వదలరు..

దాడులు జరుగుతుండటంతో నాయకులు తప్పించుకునే అవకాశం లేదు. తాజాగా గద్వాల జిల్లాలో కేసులు నమోదైన వారిలో ముగ్గురు అధికార పార్టీతో సంబంధం ఉన్న వారే. ఒకరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కూడా పనిచేశారు. కానీ కేసు నమోదు చేయడంలో ఎలాంటి ఒత్తిళ్లు పని చేయలేదనేది దీన్నిబట్టి స్పష్టమవుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా ఇప్పుడు కల్లు మాఫీయాగా ఉన్న వారు కూడా పార్టీలో కీలకంగా ఉన్నారు. వీరు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వెళ్లడం, సదరు దందాను కాపాడుకోవడం ఆనవాయితీగా చేసుకుంటారు. ప్రభుత్వం మారితే కాంట్రాక్టులు కూడా చేతులు మారుతున్న పరిస్థితుల్లో రాజకీయ పెద్దలు కాపాడతారనే భరోసా వారిలో ఉంది. అయితే ప్రతీ కల్లు దుకాణం, తయారీ కేంద్రాల్లో దాడులు నిర్వహిస్తే.. కల్తీ కల్లు, దాని తయారీదారుల బండారం బయటపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



డ్రగ్స్‌పై ఉక్కుపాదం..

సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత డ్రగ్స్‌పై మొదట ఉక్కుపాదం మోపాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఉన్నతాధికారులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చి.. ప్రత్యేక డీజీని కూడా నియమించారు. ఈ క్రమంలో ఎక్కువ కల్తీ కల్లు తయారీ అవుతున్న ఉమ్మడి పాలమూరు జిల్లాపై దృష్టి సారించారు. మొదట అత్యంత కీలకమైన మల్దకల్ మండలంలో రెండు రోజుల క్రితం దాడులు చేసిన నార్కోటిక్ అధికారులు కల్లు శాంపిళ్లు, అక్కడే కల్లు సేవిస్తున్న వ్యక్తి యూరిన్ నమూనాలను తీసుకెళ్లారు. అందులో నిషేధిత మత్తు పదార్థాలైన బెంజోడైజోఫీన్స్ పాజిటివ్‌గా తేలింది. దాంతో శ్రీధర్ గౌడ్, ధర్మేష్ గౌడ్, కేశన్న గౌడ్‌లపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైక్రోటిక్ సబ్‌స్టాన్స్ యాక్టు 1985లోని 8 సీఆర్‌డబ్ల్యూ, 22(సీ) కింద కేసు నమోదు చేశారు. వారిలో ధర్మేష్ గౌడ్‌ను అరెస్టు చేయగా.. మిగతా ఇద్దరు పరారీలో ఉన్నారు. గతంలో గద్వాలలో కల్తీకల్లు కారణంగా మరణాలు కూడా సంభవించాయి. ప్రభుత్వం మారిన తర్వాత ఈ కల్లు దుకాణాల నిర్వహణ కోసం రెండు వర్గాల మధ్య పంచాయితీలు కూడా జరిగాయి. ఎవరికివారు దుకాణాలు తెరిచారు. అయినా స్థానికంగా ఉన్న ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో కాలం వెళ్లదీశారు. ఒకమారు కల్లు దుకాణాన్ని తగులబెట్టారు. పెద్ద పెట్టుబడులు, ఖర్చులు లేకుండా.. ప్రజలను మత్తుకు బానిసలు చేయడం ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండటంతో అధికారంలో ఉన్న వర్గాల మధ్య విభేదాలు నెలకొంటున్నాయి. ఈ క్రమంలోనే దాడులు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని కల్లు దుకాణాల్లో కల్తీ కల్లు తయారు చేస్తున్న వారి వివరాలు అధికారుల వద్ద పూర్తిగా ఉన్నాయి. ఎవరు మత్తు పదార్థాలు సరఫరా చేస్తారు?.. ఎవరు తయారు చేస్తారు?.. ఎవరు నడిపిస్తారు?.. ఎవరికి రాజకీయ అండదండలు ఉన్నాయి? వంటి పూర్తి సమాచారం వారి వద్ద ఉంది. ప్రభుత్వమే డ్రగ్స్‌ను నిరోధించాలనే నినాదం తీసుకోవడంతో అధికారులు దాడులు మరింత ముమ్మరం చేయనున్నారు. త్వరలో పాలమూరు జిల్లాలో కూడా మెరుపు దాడులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.



అధికారుల దాడులతో మూతపడిన మల్దకల్‌లోని ఓ కల్లు దుకాణం

సీఎంపై ఆశలు

- సొంత గడ్డ కల్వకుర్తికి నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ
- బీఎస్ఎన్ఎల్ మైదానంలో బహిరంగ సభ



సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లపై ఐజీ సత్యనారాయణ, డీఐజీ చౌహాన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూలై 27: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సొంత గడ్డ కల్వకుర్తికి ఆదివారం రానున్న సందర్భంగా ఈ ప్రాంత ప్రజలు పలు ఆశలు పెట్టుకున్నారు. కేఎల్ఐ డీ-82 కాల్వతో పాటు సబ్ కెనాల్స్ పూర్తి, పెండింగ్ భూ నష్ట పరిహారం మంజూరుతో పాటు వంద పడకల ఆస్పత్రి మంజూరు చేస్తారని ఆశిస్తున్నారు.

దాదాపు పూర్తయిన కేఎల్ఐ డీ-82 కాల్వ

కల్వకుర్తి ప్రాంతానికి పూర్తి స్థాయిలో సాగు నీరు అందించడానికి కేఎల్ఐని రూపొందించారు. కేఎల్ఐ 29వ ప్యాకేజీలో భాగంగా కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి వరకు 160 కిలో మీటర్లు ప్రధాన కాల్వ పూర్తయ్యింది. ఈ కాల్వ మాడ్గుల మండలం నాగిళ్ల వరకు తవ్వాల్సి ఉండగా అక్కడే పనులు ఆగిపోయాయి. అక్కడి నుంచి కాల్వను కొనసాగించేందుకు డీ-82 పేరుతో రూ.179 కోట్లు మంజూరు చేశారు. 59.05 కిలో మీటర్ల ఈ కాల్వను తవ్వాలి. కాల్వ పనులు 95 శాతం పూర్తయ్యాయి. కానీ ఆమనగల్లు మండలం సింగంపల్లి వద్ద పరిహారం రాకపోవడంతో రైతులు పనులను గతంలో అడ్డుకున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి రైతులతో శనివారం మాట్లాడి పనులు చేపట్టారు. కేఎల్ఐ డీ-82 కింద మొత్తం 58,789 ఎకరాలకు నీరందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 28,150 ఎకరాలకు నీరందుతోంది. నాగిళ్ల వరకు కాల్వ పూర్తయితే పూర్తి స్థాయిలో నీరందనుంది. ఈ డీ-82లో భాగంగా రూ.80 కోట్ల భూ నష్ట పరిహారం పెండింగ్‌లో ఉంది. 254 ఎకరాలకు గాను రూ.20 కోట్లకు టోకెన్‌ను రైతులకు సిద్ధం చేయగా, ఇంకా రూ.60 కోట్లకు రాలేదు. దీంతో ముఖ్యమంత్రి ఆ పరిహారాన్ని మంజూరు చేస్తారని ఎదురు చూస్తున్నారు. మూడు జాతీయ రహదారుల కూడలిగా ఉన్న కల్వకుర్తికి వంద పడకల ఆస్పత్రి, ట్రామా కేర్ సెంటర్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యా పరంగా ఇంజనీరింగ్ కళాశాలతో పాటు పాలిటెక్నిక్ కళాశాల ఇస్తారని ఆశిస్తున్నారు.

ఆరు లేన్ల రోడ్డు కోసం..

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు జాతీయ రహదారి మూడు లేన్లు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నుంచి కల్వకుర్తి వరకు ఆరు లేన్ల రోడ్డును కేంద్రంతో మాట్లాడి మంజూరు చేయించాలని కోరుతున్నారు.

ఏర్పాట్లు పూర్తి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం కల్వకుర్తికి రానున్నారు. కల్వకుర్తి పట్టణ పరిధిలోని కొత్త గేటు వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అంతకు ముందు పట్టణంలోని మునిసిపల్ బీఎస్ఎన్ఎల్ మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సీఎం రాక సందర్భంగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. కలెక్టర్ బదావత్ సంతోష్‌తోపాటు మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

- సీఎం పర్యటనలో విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కల్వకుర్తిలో జిల్లా అధికారులతో సమీక్షించారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు.

కాంగ్రెస్ పాలనలో సంక్షేమం

- బీఆర్ఎస్ కుట్ర పూరిత రాజకీయాలు మానాలి
- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్
- ఆర్డీఎస్ నుంచి నీటి విడుదల



సింధనూర్ వద్ద ఆర్డీఎస్ షట్టర్‌ను ఎత్తుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, తదితరులు

అయిజ, జూలై 27: కాంగ్రెస్ పాలనలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేయటం జరిగిందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. ఆర్డీఎస్ ఆనకట్టకు అధికంగా నీరు రావటంతో తెలంగాణ సరిహద్దులోని అయిజ మండలం సింధనూర్ వద్ద కాల్వ షట్టర్లను శనివారం తెరిచి, నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ నీటికి గంగ పూజ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏక కాలంలో రూ.రెండు లక్షలు రుణమాఫీ చేసిన కాంగ్రెస్.. తమది రైతు ప్రభుత్వమని చాటుకుందని తెలిపారు. బడ్జెట్‌లో రైతులకు పెద్ద పీట వేసినట్లు గుర్తు చేశారు. ప్రతీ సంవత్సరం ఆర్డీఎస్‌కు ఆగస్టు 15 తర్వాత నీరు వస్తుందని, ఈ సారి జూలైలో నీరు రావటంతో విడుదల చేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టులు నిండుతున్నాయని తెలిపారు. దేవుడు సైతం తమకు తోడున్నాడని అన్నారు. రైతులు పంటలు సాగుచేసి, దేశానికి వెన్నెముకగా నిలవాలన్నారు. కుట్ర పూరితంగా గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కాలువకు నీరు రాకుండా ఆపే ప్రయత్నాలు చేశారని అన్నారు. కుట్ర పూరిత రాజకీయాలు మానకపోతే భవిష్యత్‌లో దెబ్బతినాల్సి వస్తుందని హితవు పలికారు. వరుణ దేవుడి సహకారంతో ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయని, రైతులు పంటలు నిర్భయంగా పండించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మేడికొండ లక్ష్మీకాంతరావు, జానయ్య, తనగల సీతారామిరెడ్డి, మద్దిలేటి, అడ్వకేట్ మధుకుమార్, జయన్న, దేవేంద్ర, దొడ్డప్ప, సురేంద్రస్వామి పాల్గొన్నారు.

కలగానే ట్రామా కేంద్రం

- రెండు జాతీయ రహదారులున్న జడ్చర్ల ప్రాంతం
- ఆ రోడ్లపై తరచూ ప్రమాదాలు
- క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందక గాల్లో కలుస్తున్న ప్రాణాలు



జడ్చర్ల వద్ద గల 44వ నెంబర్ జాతీయ రహదారి

జడ్చర్ల, జూలై 27: రెండు జాతీయ రహదారులకు కేంద్రంగా ఉన్న జడ్చర్లలో ట్రామా కేర్ కేంద్రం ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. 44వ, 167వ నెంబరు జాతీయ రహదారులున్న ఈ ప్రాంతంలో ట్రామా కేంద్రం ఏర్పాటు ఎంతో అవసరం ఉంది. ఈ రెండు జాతీయ రహదారులపై తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాలలో గాయపడిన వారికి సకాలంలో చికిత్స అందక.. ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 44వ నెంబరు జాతీయ రహదారి కొత్తూరు నుంచి మొదలుకొని అలంపూర్ వరకు, అలాగే 167వ నెంబరు జాతీయ రహదారి టై రోడ్డు నుంచి మొదలుకుని శిరసనగండ్ల వరకు ఉంది. ఈ రెండు జాతీయ రహదారులకు జడ్చర్ల కేంద్రంగా ఉంది. ఈ రహదారులలో ఎక్కడైనా ప్రమాదం జరిగితే జడ్చర్లలోని ఏరియా ఆస్పత్రిలో కేవలం ప్రథమ చికిత్స అందించి, జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. కొన్ని సందర్భాలలో జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తీసుకురాకుండానే నేరుగా జిల్లా జనరల్ ఆస్పత్రికి లేదా ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిస్తున్న ఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో సకాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారు.

- జడ్చర్ల మునిసిపాలిటీలోని హౌసింగ్ బోర్డు సమీపంలో 167వ జాతీయ రహదారిపై ఈ నెల 10న విజయనగర్ కాలనీకి చెందిన రాములు నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన రాములును చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నాలుగు రోజుల తర్వాత మృతి చెందాడు.

- మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి వద్ద ఈ నెల 10వ తేదీన 44వ నెంబరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం, బొలెరో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నేరేళ్లపల్లికి చెందిన శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా, కొన్ని గంటలలోనే మృతి చెందాడు.

ఈ ప్రమాదాల్లో గాయపడిని వారికి సకాలంలో వైద్యం అంది ఉంటే ప్రాణాలు దక్కేవని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర వైద్యంతో పాటు క్షతగాత్రులకు సరైన వైద్యం అందాలంటే ట్రామా కేంద్రం ఏర్పాటు చేయాలని, ఆ అవశ్యకతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నారు.

సకాలంలో అందనున్న వైద్యం

ట్రామా కేంద్రాలను ఏర్పాటు చేస్తే క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందుతుంది. ఆ కేంద్రంలో ఆర్థోపెడిక్ వైద్యులతో పాటు ప్రత్యేకమైన సిబ్బంది, అధునాతనమైన పరికరాలు అందుబాటులో ఉంటాయి. దీంతో క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అంది, ప్రాణాలు దక్కుతాయి. జడ్చర్ల ప్రాంతంలో ట్రామా కేంద్రం ఏర్పాటు చేయాలంటూ ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉన్నా, నేటికీ కలగానే మిగిలిపోయింది.



బురెడ్డిపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడు(ఫైల్)

జడ్చర్ల, బాలానగర్‌లలో ఏర్పాటుకు కృషి

రెండు జాతీయ రహదారులున్న జడ్చర్ల ప్రాంతంతో పాటు బాలానగర్‌లో ట్రామా కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తా. ఈ కేంద్రాల ఏర్పాటు అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే ట్రామా కేంద్రాలను మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య.. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహను కోరాను.

- జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే

ఉరి వేసుకొని వేర్వేరుగా

ఇద్దరి ఆత్మహత్య




పరశురాములు, అమృత(ఫైల్)

తెలకపల్లి, జూలై 27 : వివాహేతర సంబంధం కుటుంబ కలహాలకు దారితీయడంతో ఇద్దరు వేర్వేరుగా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్ఐ బి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌరారం గ్రామానికి చెందిన దండు అమృత(41)కు కల్వకుర్తి మండలం రఘుపతిపేటకు చెందిన ఓ వ్యక్తితో వివాహం చేశారు. అతన్నుంచి విడాకులు తీసుకున్న ఆమె గౌరారం గ్రామంలో తల్లి వద్దనే కొంతకాలంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన మేడకు పరశురాములు(40)కు ఆమెతో చనువు ఏర్పడింది. విషయం తెలిసిన పరశురాములు భార్య రజిత అతన్ని నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో రజిత పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. మనస్తాపానికి గురైన పరశురాములు శుక్రవారం అర్ధరాత్రి తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన అమృత కూడా శనివారం ఉదయం తల్లిగారి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇరు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

గోరింటాకు

- ఘనంగా మెహందీ వేడుకలు

భూత్పూర్, జూలై 27: భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న న్యూ ఎరా టాలెంట్ పాఠశాలలో విద్యార్థులు శనివారం మెహందీ(గోరింటాకు) వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆషాఢ మాసం సందర్భంగా మెహందీ పెట్టుకోవడం పూర్వీకుల ఆచారంగా వస్తోందని పాఠశాల కరస్పాండెంట్ కాంత్రికుమార్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భరద్వాజ్ మాట్లాడుతూ మెహిందీ పెట్టుకోవడం వల్ల శరీరంలో వేడిని తగ్గిస్తుందని, గోరింటాకును ఆయుర్వేదంలో వాడతారని వివరించారు. అందులో ఔషధ గుణాలు ఉన్నాయని శాస్త్రీయంగా రుజువైందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒకరికొకరు గోరింటాకు వేసుకుంటున్న విద్యార్థినులు



గోరింటాకు వేసుకున్న చేతులను చూపుతున్న విద్యార్థినులు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

తెలకపల్లి, జూలై 27 : మండల పరిధిలోని పెద్దపల్లిలో విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం పెద్దపల్లికి చెందిన రాజేశ్వరి(25) బర్రెలు, మేకలను పొలంలో మేపడానికి తీసుకెళ్లింది. పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి మేకలు వెళ్లగా వాటిని వెళ్లగొట్టడానికి చేతిలో ఉన్న కట్టె పైకి లేపడంతో విద్యుత్ వైర్లు తగిలి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి తాగుతున్న వ్యక్తి అరెస్టు

- 35 గ్రాముల గంజాయి స్వాధీనం

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 27 : గంజాయి తాగుతున్న వ్యక్తి సాజిద్‌ఘోరీని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. కర్నూల్ జిల్లాకు చెందిన వ్యక్తి భద్రాచలం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఉయ్యాలవాడ సమీపంలో ఒక హోటల్ దగ్గర గంజాయి తాగుతుండగా చూసిన వ్యక్తులు పోలీసులకు సమాచారమందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తిని పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మార్బుల్ గ్రానైట్స్ లారీ స్వాధీనం

- యజమానికి పెనాల్టీ విధించిన జీఎస్టీ కమిషనర్ వెంకటయ్య



జడ్చర్ల హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని హర్ష్ గ్రానైట్స్ అండ్ టైల్స్ దుకాణంలో జీఎస్టీ అధికారులు పట్టుకున్న మార్బుల్ గ్రానైట్స్ వాహనం

జడ్చర్ల, జూలై 27 : జడ్చర్లలో మార్బుల్ గ్రానైట్స్ లోడ్‌తో ఉన్న లారీని జీఎస్టీ అధికారులు పట్టుకున్నారు. జీఎస్టీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగుళూరు నుంచి వరంగల్‌కు వెళ్లాల్సిన మార్బుల్ గ్రానైట్స్ లోడ్‌తో ఉన్న లారీ జడ్చర్లలోని హర్ష్ గ్రానైట్స్ అండ్ టైల్స్ దుకాణంలో డంపు చేస్తుండగా హైదరాబాద్ రేంజ్ జీఎస్టీ కమిషనర్ వెంకటయ్య బృందం శనివారం పట్టుకున్నారు. జడ్చర్ల హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని హర్ష్ గ్రానైట్స్ అండ్ టైల్స్ దుకాణంలో ఎలాంటి పన్ను చెల్లించకుండా మార్బుల్ గ్రానైట్స్ లోడ్‌ను డంప్ చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి పన్నులు చెల్లించలేదని రుజువు కావడంతో 80వేల రూపాయలను పెనాల్టీ విధించినట్లు వెల్లడించారు. ఈ దాడులలో జీఎస్టీ అధికారి వెంకట్‌రెడ్డి, జడ్చర్ల ఏసీటీఓ అనురాగ్ ఉన్నారు.

అయోమయంలో మధ్యాహ్న భోజన కార్మికులు

» పెరిగిన నిత్యావసరాల ధరలు.. గిట్టని కూలి

అమరచింత, జూలై 27 : పెరిగిన నిత్యావసర ధరలకనుగుణంగా కనీస కూలి గిట్టుబాటు కాని దుర్భర పరిస్థితిలో మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కార్మికులు అనేక సవాళ్లు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం కార్మికులకు కూలి గిట్టుబాటు కావడం లేదు. కార్మికులు కిరాణం, కోడిగుడ్ల దుకాణాలు, కట్టెల మిషన్ల వద్ద అప్పుగా సరకులను తీసుకొచ్చి ప్రతీరోజు విద్యార్థులకు వంట వండి పెడుతున్నారు. ప్రభుత్వం మాత్రం ఐదు లేక ఆరునెలలకో సారి అందుకు సంబంధించిన బిల్లులు ఇస్తోంది. నెల నెలా బిల్లులు రాక, దుకాణ యజమానులు బాకీ రూపంలో సరకులను ఇవ్వలేక కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


అమరచింతలో వంట పనిలో నిమగ్నమైన కార్మికులు

జిల్లాలో 1200 మంది కార్మికులు

మధ్యాహ్న భోజన పథకం కింద ఉమ్మడి జిల్లాలో దాదాపు తొమ్మిది వేల మంది కార్మికులు పని చేస్తున్నప్పటికీ వనపర్తి జిల్లాలో 1200 మంది దాకా కార్మికులు ఈ పథకం కింద పని చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో అసంపూర్తిగా వంట గదులు, కొన్ని పాఠశాలల్లో అసలు వంటగదే లేక ఆరుబయట వంటలు చేస్తున్నారు. ప్రభుత్వం సిలిండర్‌ను కూడా సరఫరా చేయకపోవడంతో కట్టెలతోనే కార్మికులు వంట చేస్తున్నారు. దీని వల్ల పొగతో శ్వాసకోస, కంటికి సంబంధించిన తదితర వ్యాధులతో కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి కార్మికులకు బీమా సౌకర్యం గాని, పీఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించ లేదు.

కార్మికులకు అందని నాలుగు నెలల గౌరవ వేతనం

మధ్యాహ్నం భోజన పథకం కింద పనిచేసే కార్మికులకు గత నాలుగు నెలల గౌరవ వేతనం ప్రభుత్వం అందించలేదు. వారికి ఇచ్చే అరకొర గౌరవ వేతనంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. చాలీచాలని కమిషన్లతో వంట చేస్తున్నప్పటికీ కనీస గౌరవ వేతనమైనా దక్కుతుందని ఆశిస్తే ప్రభుత్వం వారి బిల్లులను పెండింగ్‌లో పెట్టడంతో కుటుంబ పోషణ భారంగా మారింది.


ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలో బిల్లులు అందక వ్యవసాయ పొలాల నుంచి తెచ్చిన కట్టెలతో వంట చేస్తున్న కార్మికులు

ప్రభుత్వ మెనూ ఒకలా.. ఇచ్చే డబ్బులు మరోలా..

ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కింద మెనూను అమలు చేయాలని చెప్తున్నా ఇచ్చే డబ్బులను మాత్రం పెండింగ్‌లో పెట్టడం వారికి బాధను కల్గిస్తోంది. ఇక తరగతి వారీగా ఒక్కో విద్యార్థికి.. ఒకటి నుంచి ఐదు తరగతి వరకు రూ.5.45 పైసలు, గుడ్డుకు అదనంగా ఐదు రూపాయలు నిర్ణయించింది. 6,7,8 తరగతులకు రూ.8.17 పైసలు, 9,10వ తరగతులకు గుడ్డుతో కలిపి రూ.10.65 పైసలు ప్రభుత్వం కల్పించిన ధర. రోజు వారీ మెనూ సోమవారం, బుధవారం, శుక్రవారం అన్నం, కూరగాయల సాంబార్, కోడిగుడ్డు, మంగళవారం, గురువారం అన్నం, కూరగాయల సాంబార్, రాగిజావ, శనివారం వెజ్ బిర్యానీ, టమాటా కూరగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మెనూ ప్రకారం కార్మికులు ముందుకెళ్తే వారికి కనీస కూలి గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు నెలలుగా అందని ఎగ్ బిల్లు

గత ఆరు నెలలుగా గుడ్ల బిల్లులు అందక మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ఎగ్స్ సెంటర్ల వద్ద బాకీగా తీసుకొచ్చిన డబ్బులు కట్టక, ఇక్కడ బిల్లులు అందక విద్యార్థులకు గుడ్డు పెట్టడానికి ఇబ్బంది పడుతున్నారు.

శ్రమకు తగిన డబ్బులు రావడం లేదు..



అనేక సంవత్సరాలుగా ఈ పథకం కింద పనిచేస్తున్నా పడుతున్న శ్రమకు తగిన డబ్బులు రావడం లేదు. చాలీచాలని డబ్బులతో జీవనం గడుపుతున్నా.

- దేవమ్మ, కార్మికురాలు, అమరచింత

బిల్లులు అందక అవస్థలు పడుతున్నాం..



మధ్యాహ్న భోజన మెస్ బిల్లులు నాలుగు నెలలుగా అందక ఇబ్బంది పడుతున్నాము. నెలనెలా బిల్లులు అందితే తమకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవాలి.

- పల్లవి, వంట కార్మికురాలు, మూలమల్ల గ్రామం

కార్మికులకు రూ.10వేల వేతనం ఇవ్వాలి..



వంట కార్మికులకు కనీసం రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలి. కార్మికులకు ప్రభుత్వం పీఎఫ్, బీమా సౌకర్యం అమలు చేయాలి. నెల తరబడి బిల్లులను పెండింగ్‌లో పెట్టకుండా ప్రతీనెల డబ్బులు ఇవ్వాలి. ప్రగతిశీల మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ కార్మికుల పక్షాన ఉండి వారి సమస్యలపై పోరాడుతాం.

- ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఐఎఫ్‌టీయూ ప్రగతిశీల వర్కర్స్ యూనియన్

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మెనూలో గుడ్డు పెట్టాలని ఉన్నా కార్మికులు క్రమం తప్పకుండా విద్యార్థులకు గుడ్లను అందజేస్తున్నారు. అయినప్పటికీ ఆరు నెలలుగా గుడ్లకు సంబంధించిన డబ్బులు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి క్షేత్రస్థాయిలో మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్థితిని గుర్తించి వారికి గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచి, గిట్టుబాటు ఇవ్వడంతో పాటు, నెలనెలా బిల్లులను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

డిపాజిట్ లేకుండా శుభకార్యాలకు బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 27 : రానున్న శ్రావణ మాసంలో పెళ్లిళ్లతో పాటు శుభకార్యాలు అధికంగా ఉన్నందున ఆర్టీసీ బస్సు బుక్ చేసుకుంటే డిపాజిట్ లేకుండా ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు అనుగుణంగా పెళ్లిళ్లకు బస్సులను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. సరసమైన ధరలకు, ప్రైవేటు వారితో పోలిస్తే అతి తక్కువ ధరలో స్పెషల్ హైర్ బస్సులను మీ వివాహాల గురించి తీసుకోవచ్చనని తెలిపారు. గతంలో డిపాజిట్ తీసుకున్న తర్వాత బస్సు బుక్ చేసేందుకు అవకాశం ఉండేదని, ఇప్పుడు నిబంధనలు సడలించి డిపాజిట్ లేకుండా బస్సు బుక్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదుపాయాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య

కోస్గి, జూలై 27 : ఉరి వేసుకొని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని పోలేపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అంబిక (24) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించే లోగా అప్పటికే మృతి చెందింది. కాగా ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు

జడ్చర్ల, జూలై 27 : పెట్రోల్ తీసుకువస్తానని ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి మూడు రోజులైనా ఇంటికి రాలేదని అతని కుటుంబీకులు ఫిర్యాదు చేశారని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ భార్యతో కలిసి జడ్చర్ల పట్టణంలోని పాతబజారులో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తాడు. ఈనెల 24వ తేదీన ఆటో కోసం పెట్రోల్ అవసరం ఉందని, తీసుకొస్తానని భార్యకు చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికారని, ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో విజయ్‌కుమార్ సోదరుడు నర్సింహ ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


వంశీ (ఫైల్)

తాడూరు, జూలై 27 : పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేడిపూర్ గ్రామానికి చెందిన వంశీ(20) నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 24న రాత్రి డిగ్రీ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరంలో ఆశించిన మార్కులు రాకపోవడం మూలంగా మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నప్పటికీ పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. గత నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. యువకుడికి తండ్రి వెంకటయ్యతో పాటు తల్లి వరలక్ష్మి ఉన్నారు. తల్లిదండ్రులకు ముగ్గురు సంతానం కాగా మృతుడు వంశీ చివరివాడు. తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కోడేరు, జూలై 27 : మండలంలోని నాగులపల్లితండా, నార్యనాయక్‌తండా, మూలమలపుతండాలో శనివారం ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి, ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ శారద ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 800లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి పది లీటర్ల సారా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. నార్యనాయక్‌తండా నుంచి ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఆరు లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకుని వాహనాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. సారా తయారు చేసిన వారిపై లక్ష రూపాయలు జరిమానా విధించి సంవత్సరం జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. ఎస్ఐ అరుణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘మధ్యాహ్నం’.. ఏదీ?

» మధ్యాహ్న భోజనం ఎరుగని విద్యార్థులు
» ఇంటి నుంచే లంచ్ బాక్సులు

ఉప్పునుంతల, జూలై 27: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు పాఠశాలలను తీర్చుదిద్దుతామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత స్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. గత రెండేళ్లుగా మధ్యాహ్నం భోజనానికి దూరమై ఇంటి భోజనంతో కడుపు నింపుకుంటున్న వైనం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని లత్తీపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంటోంది. గత ఏడాదిగా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టడం లేదన్న విషయం శనివారం ‘ఆంధ్రజ్యోతి’ విజిట్‌లో వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో నర్సరీ నుంచి ఐదవ తరగతి వరకు ఉంది. ఐదు తరగతులకు కలిసి 25 మంది విద్యార్థులకు విద్యాబోధన కొనసాగుతున్నది. గతంలో పాఠశాలలో వంట ఏజెన్సీలో పనిచేస్తున్న లక్ష్మమ్మకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు సక్రమంగా రాకపోవడంతో గత ఏడాది పాఠశాల ప్రారంభంలోనే వంట పనులు ఆపేసినట్లు ఆమె వాపోయారు. ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో ఇంటి నుంచి టిఫిన్‌బాక్స్ తెచ్చుకుంటున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టే విధంగా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహారాన్ని ఆరగిస్తున్న విద్యార్థులు

ఆగస్టు నుంచి మధ్యాహ్న భోజనం పెట్టేలా చూస్తాం..



గతంలో పాఠశాలలో మధ్యాహ్న భోజనం గురించి నాకు తెలియదు. నేను ఈ ఏడాది పెనిమిళ్ల నుంచి లత్తీపూర్ పాఠశాలకు బదిలీపై వచ్చాను. విద్యా కమిటీ, గ్రామస్థులతో మాట్లాడాను. ఆగస్టు నుంచి పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టే విధంగా ప్రయత్నం చేస్తున్నాం.

- సునిత, హెచ్ఎం

ప్రజలు బుద్ధి చెప్పినా పగటికలలు కంటున్న బీఆర్ఎస్

» సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి

పాలమూరు, జూలై 27 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పినా నేటికీ అధికారంలో ఉన్నామనే పగటి కలలు కంటోందని సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని విష్ణు కన్వెన్షన్ హాలులో రెండో రోజు నిర్వహించిన ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల్లో ఓయూ ప్రొఫెసర్ కాసింతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయకుండా ఇప్పుడు మేడిగడ్డ, కాళేశ్వరం వెళితే ఏమి లాభమన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇళ్లు, రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి, సామాజిక న్యాయం జరగలేదన్నారు. ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టినందున ఇంకా అధికార పక్షంలో ఉన్నామనే భ్రమను తొలగించుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. మార్క్సిజం, లెనినిజాన్ని సీపీఐ శ్రేణులు అనునిత్యం అధ్యయనం చేయాలన్నారు. భారత రాజ్యాంగ వ్యవస్థను సమూలంగా మార్చేందుకు కుట్ర జరుగుతోందని ఓయూ ప్రొఫెసర్ కాసిం అన్నారు. రాజకీయాల్లో కులం, మతం, జాతీ, నయా జాతీయవాదం చొప్పిస్తూ రాజకీయ పబ్బం గడుపు కునేందుకు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, చరిత్ర పుటలను మారుస్తూ ప్రజల మెదళ్లలో మతమౌఢ్య విష బీజాలు నాటుతున్నారని తెలిపారు.



ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న చాడ వెంకటరెడ్డి

పీఆర్ఎల్ఐ జాతీయ హోదా సాధనకు ఉద్యమిద్దాం

పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా కోసం అఖిలపక్షాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తీసుకువెళ్లాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, రాష్ట్ర నాయకులు యం.బాలనరసింహాతో కలిసి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. కేవలం మోదీకి తబలా కొట్టేవారికే ఎక్కువ నిధులు కేటాయించటం సరికాదని అన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఏపీలోని పోలవరం ప్రాజెక్టునిధులు కేటాయించి, తెలంగాణలో పీఆర్ఎల్ఐకి మొండి చేయి చూపడమేమిటని ప్రశ్నించారు. బీజేపీకి ఓట్లు వేసి గెలిపిస్తే, మొండి చేయి చూపించినందుకు ఇక్కడి ఎంపీలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నిలబెట్టుకోవాలన్నారు. రైతు రుణమాఫీపై హర్షం వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యం.బాలనరసింహ, నాయకులు యం.డి యూసుఫ్, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయరాములు, సీపీఐ గద్వాల జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, నారాయణపేట జిల్లా కార్యదర్శి సి.హెచ్. కొండన్న ప్రసంగించారు. కార్యక్రమంలో హెచ్.ఆనంద్, జి.వి.వెంకటయ్య కేశవులుగౌడ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, పి.సురేష్, కె.రాము, నరేందర్‌రెడ్డి, కె.యేసయ్య, సి.రాజు, లక్ష్మణ్, నరసింహ, శ్రీనివాస్, రాబర్ట్, శ్రీహరి, గోపాలకృష్ణ, రమేష్, నరసింహశెట్టి, శివశంకర్, గోపాల్, అబ్రహం, వెంకటేష్, ఎన్.శంకర్, అల్వాల్‌రెడ్డి, గోవర్ధన్‌బాబు, వెంకటయ్య, సంతోష్, మోష, గడ్డపార మహేష్, గోపిచారి, విజయుడు, ప్రేమ్ కుమార్, టి.వెంకటేష్, కిరణ్, లక్ష్మీపతి, రమేష్, జి.సత్యనారాయణరెడ్డి, వాసు, బి.శ్రీనివాస్, గీతమ్మ, పద్మావతి, అరుణ పాల్గొన్నారు.

కౌన్సిలర్ భర్తకు బెదిరింపు కాల్

» చంపుతానంటూ కాల్ చేసిన మహిళ
» పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

గద్వాల క్రైం, జూలై 27 : ఓ కౌన్సిలర్ భర్తను చంపుతానని బెదిరింపులకు గురి చేస్తున్న సంఘటనపై శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి జిల్లా కేంద్రంలోని ఓ వార్డుకు చెందిన కౌన్సిలర్ భర్తకు శుక్రవారం ఓ మహిళ ఫోన్ చేసి నేను ఐసీఐసీఐ బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నా.. నీవు జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్ అనే వ్యక్తికి ష్యూరిటీ ఇచ్చావు.. ఆయన నీ నెంబర్‌ను బ్యాంకు ఖాతాలో నమోదు చేశాడు.. అతను ఎక్కడున్నాడని ప్రశ్నించింది. దీంతో కౌన్సిలర్ భర్త తాను ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదని చెబుతున్నా వినకుండా అవతలి నుంచి ఆ మహిళ ఫోన్‌కాల్‌లో నీ నెంబర్ ఉందని వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించింది. కాగా, శ్రీనివాస్ అనే వ్యక్తి ఎవరో తెలియదని, నేను ఓ వార్డుకు చెందిన కౌన్సిలర్ భర్తను అని చెప్పుకొస్తున్నా వినకుండా అవతలి నుంచి మహిళ మాట్లాడుతూ.. నీవు ఎవరో నాకు తెలుసు.. నీవు నేను చెప్పినట్లు వినకుంటే నిన్ను చంపుతా అని బెదిరిస్తుండడంతో ఫోన్ కట్ చేశాడు. మళ్లీ ఆ మహిళ ఇంకో కొత్త నెంబర్ నుంచి పదేపదే ఫోన్ చేసిందన్నారు. శనివారం కౌన్సిలర్ భర్త పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాస్ స్పందిస్తూ.. ఫోన్ చేసిన నెంబర్‌ను పరిశీలిస్తున్నామని, మహిళ చేసిన మూడు నెంబర్లను ట్రేస్‌ఔట్ జరిగిన వెంటనే వివరాలు వెల్లడిస్తామన్నారు. ఇది కూడా ఒక సైబర్ క్రైమ్ వంటిదని, దీనిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

బదిలీల్లో యూనియన్లకు షాక్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూలై 27 : ప్రభుత్వం నిర్వహిస్తున్న జనరల్ బదిలీల్లో యూనియన్లకు షాక్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవోఎంఎస్ నెంబర్ 80 విడుదల చేసింది. ఈ బదిలీల్లో యూనియన్‌ల పేరుతో ఆఫీస్ బేరర్ అని చాలా మంది బదిలీల్లో మినహాయింపు తీసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో చాలా మంది యూనియన్ల పేరుతో ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారు ఉన్నారు. వారంతా ప్రస్తుతం ఎక్కడ పని చేస్తున్నారో అక్కడే ఉంచాలని దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ప్రభుత్వం మాత్రం ఆఫీస్ బేరర్స్ అంటూ ఎవ్వరికి కూడా మినహాయింపు ఇవ్వలేదు. అంతేకాకుండా వాటిని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో యూనియన్ నాయకులు అయోమయంలో పడ్డారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆరేళ్లకు పైబడి పని చేస్తున్న వారందరు ఖచ్చితంగా బదిలీ కావలసిందే. ఎవరెవరు ఎక్కడికి బదిలీ అవుతారో ఈనెల 31 వరకు తేలనుంది.

రాష్ట్ర స్థాయి షటిల్ టోర్నీలో మూడో స్థానంలో జిల్లా జట్టు


మూడో స్థానంలో నిలిచిన జిల్లా జట్టుకు చెందిన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 27 : వరంగల్ జిల్లాలో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో అండర్-17 డబుల్స్ విభాగంలో జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచింది. జిల్లా జట్టు మూడో స్థానంలో నిలువడం పట్ల జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌గౌడ్, రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్ సంతోషం వ్యక్తం చేస్తూ జట్టు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

కృష్ణానదిలోకి మత్స్యకారులు, పర్యాటకులు వెళ్లొద్దు

» రెవెన్యూ, పోలీస్ అధికారుల హెచ్చరిక


జాలర్లు నదుల్లోకి వెళ్లవద్దంటూ ఆదేశాలు జారీ చేస్తున్న ఎస్ఐ రుషికేష్

కొల్లాపూర్/పెంట్లవెల్లి, జూలై 27 : ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు సోమశిల కృష్ణానదికి వరద ఉధృతి తీవ్రంగా ఉందని ఈ సమయంలో మత్స్యకారులు, జాలర్లు, పర్యాటకులు ఎవరూ నదిలోకి వెళ్లవద్దని ఆర్డీవో పి.నాగరాజు, కొల్లాపూర్ ఎస్ఐ రుషికేష్‌లు హెచ్చరించారు. శనివారం కొల్లాపూర్, పెంట్లవెల్లి మండల పరిధిలోని కృష్ణానది తీర ప్రాంతాలైన సోమశిల, మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల్లో కృష్ణానది పరివాహక ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో పి.నాగరాజు, ఎస్ఐ రుషికేష్, సిబ్బందితో కలిసి కృష్ణానది తీర గ్రామాల్లోని పుష్కరఘాట్ల వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తుందని కృష్ణానదిలోకి ఎవరూ దిగరాదని, జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని, పర్యాటకులు నదిలోకి వెళ్లవద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. జాలర్లకు, మరబోటు యజమానులకు రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా సూచనలు చేశారు. పర్యాటకులు నదిలో స్నానాలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, నదిలో మొసళ్లు ఉండే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షణికావేశం.. పిల్లలకు శాపం


చికిత్స పొందుతున్న మహిళ

మహబూబ్‌నగర్ (వైద్య విభాగం), జూలై 27 : ఓ తల్లి క్షణికావేశంలో పంటలకు వాడే ఎరువుల మందు తాగి ప్రాణాల మీదకు తెచ్చుకుంది. కానీ, ఆమె పిల్లలకు అదే శాపంగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మొరంబాయి గ్రామానికి చెందిన శేఖర్, రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామానికి చెందిన స్వాతిలు 12 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ప్రస్తుతం ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. అందులో ఒక పాపకు దాదాపు ఎనిమిది నెలల వయసు ఉంటుంది. మిగతా ఇద్దరిలో ఒకరు ఎనిమిదేళ్లు, మరొకరు నాలుగేళ్ల వయసు ఉండగా, ప్రస్తుతం ఆమె మూడు నెలల గర్భిణీ అవ్వడం విశేషం. భార్యాభర్తలిద్దరు తరచూ గొడవలు పడుతుండేవారని, శనివారం కూడా గ్రామంలో గొడవపడడంతో ఆమె పంట పొలాలకు వాడే ఎరువుల మందు తాగింది. గమనించి చుట్టుపక్కల వాళ్లు ఆమెను అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ముగ్గురు పిల్లలు ఆసుపత్రిలోనే ఓ పక్కన కూర్చున్నారు. కానీ, ఏడు నెలల పసికందు గుక్కపెట్టి ఏడుస్తుండడంతో ఆసుపత్రిలోని నర్సింగ్ విద్యార్థులు ఎత్తుకొని లాలించారు. అక్కడి దృశ్యం చూసిన వారంతా ఒక్కొక్కరు ఒక్కో పాపను దగ్గరకు తీసుకొని లాలించారు. లోపల తల్లి అపస్మారక స్థితిలో ఉండగా, బయట పిల్లల దుస్థితిని చూసి కంటతడి పెట్టుకున్నారు. ఆమె భర్తకు, బంధువులకు ఫోన్ చేసినా ఒక్కరు కూడా ఆసుపత్రికి రాలేదు. దీంతో పిల్లలను ఐసీడీఎస్ అధికారులు బాలసదన్‌కు తీసుకెళ్లారు. సాయంత్రం తర్వాత మెలకువలోకి వచ్చిన తల్లి తన పిల్లలు కావాలని ఆసుపత్రిలో గోల గోల చేసింది. పోలీసులు సముదాయించి ఆమెను బాలసదన్‌కు పంపించారు. అక్కడి సిబ్బంది ఆమెకు పిల్లలను అప్పగించకుండా ఎవరైనా బంధువులు వస్తే పిల్లలను ఇస్తామని, ఆమెను కూడా అక్కడే ఉండాలని సూచించారు.


పసిపాపను లాలిస్తున్న నర్సింగ్ విద్యార్థిని

కుళ్లిన మాంసం.. ఎక్స్‌పైరీ నూనెలు

» పట్టణంలోని పలు హోటళ్లను తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారి
» పాచిపోయిన అన్నం, చికెన్ కర్రీ లభ్యం

వనపర్తి టౌన్, జూలై 27: వనపర్తి పట్టణంలోని పలు హోటళ్లను ఫుడ్‌సేఫ్టీ అధికారి నీలిమ శనివారం తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో పాచిపోయిన అన్నం, చికెన్, కుళ్లిన మాంసం, గడువు దాటిన నూనె వాడుతున్నట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారులు గుర్తించారు. రాత్రి మిగిలిపోయిన అన్నం, మాంసం, కాలం చెల్లిన నూనెలు, డాల్డ ప్యాకెట్లు, బూజుపట్టిన పచ్చి బటానీలు, దుర్వాసన వెదజల్లుతున్న ఇతర ఆహార పదార్థాలు చూసి అధికారులు అవాక్కయ్యారు. రాత్రి మిగిలిన ఫుడ్‌ను ఫ్రిజ్‌లో పెట్టడాన్ని గుర్తించిన ఆమె మొత్తం చెత్త బుట్టలో పారబోశారు. పట్టణంలోని కొత్తకోట రోడ్డులో గల అభిరుచి హోటల్, అక్షయ హోటల్, మంజునాథ బేకరీ, వెనీల మిల్క్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతూ, ధనార్జనే లక్ష్యంతో కొందరు వ్యాపారులకు నిబంధనల ప్రకారం ఫైన్‌లు వేశామని, కేసును నమోదు చేస్తామని తెలిపారు. అను మానం వచ్చిన అల్లం వెల్లులి పేస్ట్, మిర్చి పౌడర్, మైదపిండి, దిల్‌కుష్ బ్రెడ్, పాలు, పెరు గు శ్యాంపిల్స్ సేకరించామని తెలిపారు. సేకరించిన శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి రిపోర్ట్ వచ్చిన తరువాత వాటి ఆధారంగా కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఇక నుంచి నిత్యం తనిఖీలు చేస్తామని, ఆహార పదార్థాల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. తనిఖీలో జూనియర్ అసిస్టెంట్ వాజీద్ తదితరులున్నారు.


పాచిపోయిన ఆహార పదార్థాలను చూపుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారి నీలిమ

సౌకర్యాలు లేని బస్టాండ్లు

- ప్రాంగణాల్లో ప్రయాణికులకు తప్పని అగచాట్లు
- దుస్థితిలో అయిజ బస్టాండ్
- శక్తిపీఠం వద్ద కనబడని ప్రయాణికుల ప్రాంగణం
- సీసీకి నోచుకోని అయిజ బస్టాండు
- జిల్లాలో ఐదు చోట్లనే ఆర్టీసీ ప్రాంగణాలు
- బస్సుల కోసం రోడ్లపైనే ప్రయాణికుల ఎదురుచూపు
- అలంకార ప్రాయంగా ధరూరు, శాంతినగర్ బస్టాండ్లు



సౌకర్యాలు కరువైన అయిజ బస్టాండ్



అలంపూర్ బస్టాండ్‌కు అడ్డంగా నిలిచి ఉన్న ప్రైవేటు వాహనాలు

గద్వాల అర్బన్, జూలై 27 : జోగుళాంబ గద్వాల జిల్లాలో రాకపోకలు కొనసాగించే ఆర్టీసీ ప్రయాణికులకు బస్టాండులు కరువయ్యాయి. ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల రాకకోసం రోడ్లపైనే ఉండే దుస్థితి నెలకొంది. జిల్లా కేంద్రం తర్వాత ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో ఉండే అయిజ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కూడా లేకపోగా, 30 ఏళ్ల క్రితం నిర్మాణమైన బస్టాండ్ ప్రాంగణంలో ఇప్పటికీ సీసీ ప్లాట్‌ఫాం లేకపోవడం అక్కడి దుస్థితికి నిదర్శనం. దక్షిణ కాశీగా పేరున్న అలంపూర్‌కు ప్రతీ రోజు వందల సంఖ్యలో యాత్రికులు, ప్రయాణికులు వచ్చి పోతున్నా బస్టాండు ఉన్న సంగతి కూడా ఎవరికీ తెలియడం లేదు. నామమాత్రంగా ఉన్న బస్టాండ్ వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో ప్రైవేటు వాహనాలు, ఆటోలు నిలిచి ఉండటంతో ఆర్టీసీ బస్సులు అటువైపు వెళ్లడమే మానుకున్నాయి. పేరుకు మాత్రమే బస్టాండ్ ఏర్పాటు చేయగా, అందులో కనీసం కూర్చునేందుకు కుర్చీలు లేకపోగా, మూత్రశాలలు కూడా లేక మహిళలు నిత్యం అవస్థలే అనుభవిస్తున్నారు.

ఆదిశిలా క్షేత్రంగా పేరుగాంచిన మల్దకల్ స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుండగా, మల్దకల్‌లో ఇప్పటి వరకు బస్టాండ్ నిర్మాణం గురించి ఆలోచించిన వారే లేరంటే అతిశయోక్తి లేదు. 1987లో మండల కేంద్రంగా ఏర్పాటైన నాటి నుంచి గట్టులో ఇప్పటివరకు కనీసం బస్‌షెల్టర్ కూడా ఏర్పాటు చేయలేదు. గ్రామంలోని ప్రధాన రోడ్డు కూడలి వద్ద నిలుస్తున్న ఆర్టీసీ బస్సులు అక్కడి నుంచే ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపడం చేస్తుంటాయి. దీంతో పాటు మానవపాడు, ఇటిక్యాల మండల కేంద్రాల్లో ఏర్పాటుచేసిన షెల్టర్ల వద్ద బస్సులు ఆగే పరిస్థితి లేక అవి పూర్తిగా కనుమరుగయ్యాయి. 2016లో మండల కేంద్రంగా ఏర్పాటైన ఉండవెల్లిలో దాతల సహకారంతో కేవలం షెల్టర్ మాత్రమే ఏర్పాటుకాగా, చాలీచాలని స్థలంతో ప్రయాణికులంతా రోడ్లపైనే బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితే జాతీయ రహదారి అలంపూరు క్రాస్‌రోడ్డు, ఎర్రవల్లి క్రాస్ రోడ్లలోనూ నెలకొంది. ఇటు కర్నూలు వైపు, అటు హైదరాబాద్‌వైపు వెళ్లే ప్రయాణికులు ఈ రెండు చౌరస్తాల వద్ద బస్సుల కోసం రోడ్లపైనే వేచి ఉంటుండగా పలు సందర్భాల్లో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి.



శాంతినగర్‌లో బస్సుల కోసం రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

నిరుపయోగంగా...

జిల్లా కేంద్రం గద్వాల, మరో ముఖ్య పట్టణం అయిజలో మాత్రమే బస్టాండులు ఉండగా, గద్వాల డిపో పరిధిలోని ప్రధాన రూట్లుగా పేరున్న రాయచూరు-గద్వాల, రాయచూరు-ఎరిగెర-అయిజ-అలంపూరు రోడ్లలో ధరూరు, శాంతినగర్ మండల కేంద్రాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన రెండు బస్టాండులు నిరుపయోగంగా మారాయి. శాంతినగర్ మీదుగా ప్రతిరోజు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన బస్సులు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నా బస్టాండ్ ఉపయోగంలోకి రాకపోవడం తీవ్ర అసౌకర్యంగా మారింది. ధరూరులో బస్టాండ్ నిర్మించి ఇరవై ఏళ్లు దాటినా ఇప్పటివరకు ఒక్కరోజు కూడా ఆ బస్టాండులో బస్సులు ఆగిన పాపాన పోలేదు. దీంతో ప్రయాణికులంతా బస్సుల కోసం వైఎస్ఆర్ సర్కిల్‌లో వేచి ఉంటున్నారు. సర్కిల్‌లో వాహనదారులు ఇబ్బంది పడుతుండగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూపాయలు లక్షల్లో ఖర్చుచేసి నిర్మించిన బస్టాండ్ దిష్టిబొమ్మలా మిగిలిపోగా యాచకులకు ఆవాసంగా మారింది.

అయిజ బస్టాండులో సౌకర్యాలు కరువు

గద్వాల బస్టాండుకు సరిసమాన స్థాయిలో దాదాపు 30ఏళ్ల క్రితమే నిర్మించిన అయిజ బస్టాండులో ఇప్పటికీ సౌకర్యాలు లేవు. ప్రతిరోజు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలు డిపోల బస్సులు వందల సంఖ్యలో సంచరించే అయిజ బస్టాండు ప్రాంగణానికి ఇప్పటివరకు సీసీ ప్లాట్‌ఫాం నిర్మించలేదు. గుంతలమయంగా ఉండి వానాకాలంలో బురదగుంటగా మారుతున్న బస్టాండులో బస్సులను ఆపకుండా ముఖద్వారాల వద్దనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండగా, ఇతరులు ప్రతిరోజు ఇక్కడ నరకయాతన అనుభవిస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ప్లాట్‌ఫాంలు కూడా పెంచకపోవడం మరో సమస్యగా ఉంది. దీనికితోడు చీకటి పడితే దీపాలు లేని ఈ బస్టాండులోకి ప్రయాణికులు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా బస్టాండుకు ప్రహరీ లేకపోవడం, పశువులు, పందులు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రయాణికులను అసౌకర్యానికి గురిచేస్తున్నాయి. అయిజ బస్టాండ్‌లో విద్యార్థుల సౌకర్యం కోసం బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయాలని స్థానికులు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నుంచి ఒత్తిడి పెరుగుతున్నా అధికారుల నుంచి స్పందన కరువైంది.

సమస్యల పరిష్కారంపై దృష్టి



అలంపూరు, అయిజ బస్టాండుల్లో సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు ప్రారంభించాం. ప్రయాణికులు రానందువల్లే ధరూరు, శాంతినగర్ బస్టాండ్ల వద్ద బస్సులు ఆపడం లేదు. ఈ విషయంలో స్థానికులు, పోలీసుల సహకారం ఉంటే రోడ్లపై ప్రయాణికులు ఆగకుండా చర్యలు సాధ్యపడతాయి. ఆ దిశగా మా ప్రయత్నాలు చేస్తున్నాం. అవసరమైన చోట్ల డిపో తరఫున కంట్రోలర్లను నియమించి బస్సుల రాకపోకలపై సమాచారం ఇచ్చే ఏర్పాటు చేశాం. ఐదురోజుల క్రితమే బదిలీపై వచ్చాను. రెండు, మూడు రోజుల్లో జిల్లాలోని ప్రతీ బస్టాండ్‌ను సందర్శించి అక్కడి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తా.

- చేరాల మురళీకృష్ణ, గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్

ఓపెన్ స్కూల్స్‌లో అడ్మిషన్లు ప్రారంభం

గద్వాల టౌన్, జూలై 27 : తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ స్కూల్స్‌లో 2024-25 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని డీఈవో ఏ.ఇందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8 నుంచి సెప్టెంబరు 10వ తేదీలోగా ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్‌లలో ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అడ్మిషన్ పొందవచ్చన్నారు. అడ్మిషన్‌కు సంబంధించి ఎస్ఎస్‌సీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మాజీ సైనిక ఉద్యోగులు పిల్లలు, అన్నివర్గాల స్త్రీలకు రూ.150లు రిజిస్ట్రేషన్ ఫీజు, రూ.వెయ్యి అడ్మిషన్ ఫీజు, ప్రతీ అదనపు సబ్జెక్టుకు రూ.200లు, ప్రతీ సబ్జెక్టు మార్పునకు రూ.250లు రుసుము చెల్లించాలన్నారు. జనరల్ కేటగిరీ కోర్సులకు రూ.150లు రిజిస్ట్రేషన్ ఫీజు, రూ.1400లు అడ్మిషన్ ఫీజు, ప్రతీ అదనపు సబ్జెక్టుకు రూ.200లు, ప్రతీ సబ్జెక్టు మార్పునకు రూ.250లు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మాజీ సైనిక ఉద్యోగులు పిల్లలు, అన్నివర్గాల స్త్రీలకు రూ.300లు రిజిస్ట్రేషన్ ఫీజు, రూ.1200లు అడ్మిషన్ ఫీజు, ప్రతీ అదనపు సబ్జెక్టుకు రూ.300లు, ప్రతీ సబ్జెక్టు మార్పునకు రూ.300లు రుసుము చెల్లించాలన్నారు. జనరల్ కేటగిరీ కోర్సులకు రూ.300లు రిజిస్ట్రేషన్ ఫీజు, రూ.1500లు అడ్మిషన్ ఫీజు, ప్రతీ అదనపు సబ్జెక్టుకు రూ.300లు, ప్రతీ సబ్జెక్టు మార్పునకు రూ.300లు రుసుము చెల్లించాలన్నారు. ఎస్ఎస్‌సీ వారికి రూ.100లు అపరాధ రుసుముతో, ఇంటర్ వారికి రూ.200లు అపరాధ రుసుముతో సెప్టెంబరు 11 నుంచి అక్టోబరు మూడవ తేదీ వరకు అడ్మిషన్ పొందే అవకాశం ఉంటుందన్నారు.

ఆయూష్ పోస్టులను భర్తీ చేయాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మెడికల్ అసోసియేషన్ సభ్యులు

గద్వాల న్యూటౌన్, జూలై 27 : నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌లో ఆయూష్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయూష్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ శనివారం నేషనల్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ పి.రవికుమార్, కవిత, నరేష్ తదితరులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌లో ఆయూష్ పోస్టుల భర్తీకి గత ఏడాది ఆగస్టులో దరఖాస్తులు స్వీకరించారన్నారు. కమిషనర్ నుంచి వెలువడిన 2022 గైడ్‌లైన్స్ ప్రకారం పలు జిల్లాల్లో నియామకాలు చేపట్టారని, మల్టీజోన్-2లోని జోగుళాంబ గద్వాల జిల్లాలో నియామకాలు నేటికీ చేపట్టకపోవడంలో అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారులతో పాటు, కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యమన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రొవిజనల్ లిస్టును విడుదల చేసి కౌన్సెలింగ్ నిర్వహించాలని సభ్యులు కోరారు.

పశువైద్య శిబిరం పరిశీలన

గట్టు, జూలై 27 : మండల పరిధిలోని బోయలగుడ్డం గ్రామంలో శనివారం సమగ్ర గ్రామీణ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఎల్‌టీఐ మ్యాన్‌డేటరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఎంపీడీవో చెన్నయ్య పరిశీలించారు. శిబిరంలో 45 పశువులకు వ్యాక్సినేషన్ చేయించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల పైకప్పు, మరమ్మతుల విషయమై హెచ్‌ఎంతో చర్చించారు. ఆ తర్వాత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వెటర్నరీ అసిస్టెంట్ పృథ్వీరాజ్, కనకరాజు, ఏఈవో భక్తవత్సలం, భవిష్య భారత్ డిప్యూటీ ప్రాజెక్టు మేనేజరు బాలరాజు, రాజరాం, లైవ్లిహుడ్ అధికారి హరికృష్ణ, అడ్మిన్ అసిస్టెంటు మునిస్వామి తదితర రైతులు పాల్గొన్నారు.

29న ఎంబీ హైస్కూల్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రకాష్, ఉపాధ్యాయులు

గద్వాల టౌన్, జూలై 27 : పట్టణంలోని కృష్ణారెడ్డి బంగ్లాలో గల ఎంబీ హైస్కూల్‌లో ఈనెల 29న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు హెడ్‌మాస్టర్ ప్రకాష్ తెలిపారు. పాఠశాల ప్రారంభమై 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న చారిత్రక ఉత్సవానికి పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలను దక్కించుకున్న పూర్వపు విద్యార్థులు, వివిధ రంగాల్లో స్థిరపడిన ప్రముఖులు ఉత్సవాలు విజయవంతమయ్యేందుకు సహకరించాలని కోరారు. శనివారం పట్టణంలోని పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో కలిసి విలేకరులతో మాట్లాడిన హెడ్‌మాస్టర్ ప్రకాష్ ఎంబీ హైస్కూల్ చరిత్ర, సాధించిన విజయాలు తదితర విషయాలను వివరించారు.

అణ్వస్త్ర పితామహుడు అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఆదర్శ సంఘం విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉండవల్లి, జూలై 27 : భారత మాజీ రాష్ట్రపతి డా.ఏపీజే.అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని ఆదర్శ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వెంకట్ గౌడు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఆదర్శ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం తొమ్మిదవ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఉన్న కలాం విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. శాస్త్రవేత్తగా, డాక్టర్‌గా, రాష్ట్రపతిగా కలాం చేసిన సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.మద్దిలేటి, ఉపాధ్యాయులు ప్రణీత, గాయత్రి, శ్రీలక్ష్మి, అనిత, సత్యనారాయణ, గ్రామస్థులు నర్సప్ప, రవికుమార్, రమేష్, రఫీక్ పాల్గొన్నారు.

రాయల సంస్మరణ సభను విజయవంతం చేయాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్



శాంతినగర్‌లో సంస్మరణ సభ పోస్టర్లను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

వడ్డేపల్లి, జూలై 27 : ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు నిర్వహించే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్ కోరారు. సంస్మరణ సభ పోస్టర్లను శనివారం శాంతినగర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా ఎన్నో ఉద్యమాల్లో చంద్రశేఖర్ చురుగ్గా పాల్గొని కార్మికులు, రైతుల పక్షాన పోరాటాలు సాగించారన్నారు. సంస్మరణ సభకు జిల్లాలోని అన్నివర్గాల వారు భారీ ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జూలకల్ మధు, నాయకులు పచ్చర్ల తిమ్మన్న, మద్దిలేటి, ప్రభుదాసు, పెద్దయ్య, శ్రీరాములు, దస్తగిరి ఉన్నారు.

ఆరు గ్యారెంటీల అమలును విస్మరించిన ప్రభుత్వం

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గొంగళ్ల ఈశ్వర్

వడ్డేపల్లి/ఇటిక్యాల, జూలై 27 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గొంగోళ్ల ఈశ్వర్ అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోయ రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం వడ్డేపల్లి మండల కేంద్రంలో పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గొంగళ్ల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. హామీలను అమలు చేయకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంజన్నగౌడ్, ఉపాధ్యక్షుడు రవియాదవ్, రాఘవేంద్ర, పైపాడు బూత్ అధ్యక్షుడు బి.శివ, సురేష్, వేణు, వంశీ, గణేష్, కార్యదర్శులు పరుశరాముడు, వినోద్ పాల్గొన్నారు. అదేవిధంగా, ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామంలో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు అబ్దుల్లా ఆధ్వర్యంలో పార్టీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ గద్వాల జిల్లా కార్యవర్గ సభ్యుడు తిమ్మారెడ్డి మాట్లాడారు. బీజేపీ నాయకులు గోవిందు, కళ్యాణకృష్ణ, మహేష్, శివ, వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుంకేసుల డ్యాంకు పోటెత్తిన వరద

- ఎగువ నుంచి లక్ష క్యూసెక్కుల నీరు
- 28 గేట్లు ఎత్తి దిగువకు 99 వేల క్యూసెక్కులు విడుదల
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి తహసీల్దార్ హరికృష్ణ



డ్యాంను పరిశీలిస్తూ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ హరికృష్ణ

రాజోలి, జూలై 27 : మండల కేంద్ర శివారులోని సుంకేసుల జలాశయానికి శనివారం వరద నీరు పోటెత్తింది. కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర డ్యాం నుంచి విడుదల చేసిన వరద నీరు సుంకేసుల డ్యాంకు పోటెత్తింది. దీంతో సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి ఒక లక్షా రెండు వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో జలాశయం 28 గేట్లు తెరిచి దిగువకు 99 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం జేఈ రాజు తెలిపారు. శనివారం సాయంత్రం డ్యాంను జేఈతో పాటు, తహసీల్దార్ హరికృష్ణ రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ డ్యాం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ డ్యాంకు లక్ష క్యూసెక్కులకు పైగా వరద వస్తోందని, డ్యాం క్రింది ప్రాంతాల్లో నివసించే రాజోలి, తూర్పుగార్లపాడు, బుడమర్సు, మద్దూరు తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద మరింత పెరిగితే గ్రామాల్లోకి నీరు వచ్చే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరికలు జారీ చేశారు. మత్స్యకారులు చేపలవేటకు నదిలోకి వెళ్లకూడదని డ్యాం వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలి

- డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్.ఆనంద్



గెలుపొందిన క్రీడాకారిణులకు మెడల్స్‌ను అందజేస్తున్న డీవైఎస్‌వో

గద్వాల అర్బన్, జూలై 27 : విద్యార్థులు, యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని డీవైఎస్‌వో డాక్టర్ బీఎస్.ఆనంద్ అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు డీవైఎస్‌వో ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. నేటి సమాజంలో యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఏదైనా ఒక క్రీడను ఎంచుకుని అందులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అంతేగాక విద్యార్థి దశ నుంచే క్రీడలపై మక్కువ పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లాకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా మండలాల నుంచి 350 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారన్నారు. ప్రతిభ చాటిన 20 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని, వారు ఆగస్టు ఏడో తేదీన రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్య అతిథుల చేతులమీదుగా మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసన్న, హైమావతి, నగేష్‌బాబు, ఆనంద్‌కుమార్, బషీర్, కోచ్ ఆంజనేయులు, పరశురాములు ఉన్నారు.

ఉపాధి హామీ పథకానికి ఐదు లక్షల కోట్లు కేటాయించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

గద్వాల టౌన్, జూలై 27 : ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.ఐదు లక్షల కోట్లు కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు కోరారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ వామపక్షాలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధుల కోత పెడుతున్నట్లు ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం మంది ప్రజలు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తుండగా అందులో అత్యధికులు వ్యవసాయ కూలీలు, కార్మికులేనన్నారు. ఉపాధి కూలీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గమే ఎక్కువ సంఖ్యలో ఉండగా నిధుల కోతతో కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఇదిలా ఉంటే కేంద్రం ఇచ్చిన నిధులు సైతం ఖర్చు చేయకుండా కూలీలకు నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంచడం దుర్మార్గమన్నారు. ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని, కనీస వేతనం రూ.600లు ఇవ్వాలని, కూలీ ప్రదేశాల్లో తగిన సౌకర్యాలతో పాటు, కార్డు పొందిన ప్రతీ కూలీకి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పద్మ, ఆంజనేయులు, జిల్లా నాయకుడు రేపల్లె దేవదాసు, జి.రాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటస్వామి, రాఘవేంద్ర, రాజు, జయన్న, బాషా, సిద్ధప్ప, నరసింహ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



అంతంపల్లిలో బోనాలు ఎత్తుకున్న విద్యార్థినులు

గట్టు/అయిజ, జూలై 27 : గట్టు మండలం అంతంపల్లి గ్రామంలో శనివారం ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు బోనాల పండుగ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినులు నెత్తిపై బోనం కుండలు పెట్టుకుని భక్తిశ్రద్ధలతో పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుంచి ర్యాలీగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. విద్యార్థుల వేషధారణలు, నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు అశోక్, పరుశురాముడు, ఎంవీఎఫ్ వలంటరీ దానయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా, అయిజలో శనివారం ప్రజలు బోనాల సంబురాలు జరుపుకున్నారు. సోమవారం బోనాల పండుగ కావటం ఆ రోజు సెలవు దినం కావటంతో ముందస్తుగా శనివారం పండుగను జరుపుకున్నారు. పట్టణంలోని బీజీఆర్, కృష్ణవేణి, అక్షర, గీతాంజలి, లయేలా పాఠశాలల యజమాన్యాలు పండుగ వేడుకలు జరుపుకున్నాయి. విద్యార్థులు దేవతామూర్తులు, పోతురాజుల వేషధారణలతో ఆకట్టుకున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కలిసిన ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప

గద్వాల న్యూటౌన్, జూలై 27 : గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని గద్వాల జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు రోగాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్యసేవలు సకాలంలో అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామకృష్ణ, ఎంపీ ఈహెచ్‌వో నరేంద్రబాబు, డీపీహెచ్‌ఎన్‌వో వరలక్ష్మి తదితరులున్నారు. అదేవిధంగా, జడ్పీ సీఈవో కాంతమ్మ, కేటీదొడ్డి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయరెడ్డి తదితరులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే వారితో మాట్లాడారు. గట్టు ఎంపీడీవో చెన్నయ్య, ఎంపీవో కృష్ణమోహన్ తదితరులున్నారు.

ఎల్‌వోసీ అందజేత



కుటుంబ సభ్యుడికి ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

వడ్డేపల్లి, జూలై 27 : మండల పరిధిలోని శాంతినగర్‌కు చెందిన రఘు మెరుగైన చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ప్రభుత్వం నుంచి రూ.80వేలు ఎల్‌వోసీ మంజూరైంది. శనివారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హైదరాబాద్‌కు వెళుతుండగా మార్గమధ్యలో బాధితుడికి ఎల్‌వోసీని అందించారు. ఎమ్మెల్యే వెంట షైపాల్‌రెడ్డి, పుల్లూరు రఘురెడ్డి, అనిల్‌కుమార్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే

రాజోలి, జూలై 27 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్య అధికారి డా.మధుబాబు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులను అరికట్టవచ్చని డా.మధుబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రంజిత్‌కుమార్, రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల బెడదను నియంత్రించాలి

గద్వాల టౌన్, జూలై 27 : పట్టణంలో రోజురోజుకు పెరిగిపోతున్న దోమల బెడదను నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, కమిటీ సభ్యుడు ఉప్పేరు నరసింహ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. ఇటీవల వారం రోజుల పాటు వర్షం ముసురుతో పట్టణంలోని ఖాళీ ప్రదేశాలు, డ్రైనేజీ పరిసరాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాటు, పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ఉండటం వల్ల దోమల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు. గడచిన రెండు రోజులుగా వర్షం రాకపోవడంతో ఒక్కసారిగా దోమలు విజృంభించాయని, ప్రజలు రోగాల బారిన పడక మునుపే మునిసిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

అయిజ, జూలై 27: విద్యార్థులు క్రమశిక్షణతో చక్కగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రైవేటు పాఠశాలల జిల్లా కోశాధికారి రమేష్, లయేలా పాఠశాల కరస్పాండెంట్ సన్నీ అన్నారు. పదో తరగతి పరీక్షల్లో లయేలా పాఠశాల నుంచి 10 జీపీఏ సాధించిన ఇద్దరు విద్యార్థినులు తేజస్విని, శృతిహాసన్‌లను సన్మానించి, నగదు బహుమతిని అందించారు.